

# నయన

-కోనే నాగవెంకట ఆంజనేయులు

గోడ గడియారం గంటలు కొట్టడం మొదలుపెట్టగానే ఆరిన చీరను మడతపెడుతున్న నయన ఒక్క క్షణం తను చేస్తున్న పని ఆపింది.

గడియారం ఆరు గంటలు కొడుతుందని తెలిసినా.. ఒకటి .. రెండు... అంటూ మనసులోనే గంటలను లెక్కబెట్టింది.

ఆరు గంటలు కొట్టి ఊరుకుంది గడియారం.

ఆమె ముఖంలో చిరునవ్వు ఉదయించింది. త్వరత్వరగా చీరలన్నీ మడతపెట్టేసి బీరువాలో సర్దేసింది.

ముఖానికి పౌడరు రాసుకుని - ఇప్పుడో మరి కాసేపట్లోనో రాబోయే భర్తకోసం ఎదురు చూస్తూ గుమ్మం దగ్గర నించుంది.

వంటగదిలో వంటమనిషి వంటచేస్తున్న చప్పుళ్ళు వినిపిస్తున్నాయి.

వీధిలో వస్తూ పోతున్న స్కూటర్లు చేసే శబ్దాలను శ్రద్ధగా వింటోంది నయన. ఆమె లెక్క ప్రకారం మరో రెండు, మూడు నిముషాల్లో భర్త చంద్రం స్కూటర్ ఆగాలి ఇంటి ముందు.

రెండు స్కూటర్లు వెళ్ళిపోయాయి రెండు నిముషాల్లో. దూరంగా వినిపిస్తున్న స్కూటర్ శబ్దం ఆమె చెవులకు వీణానాదంలా సోకింది. ఆనందంగా ఆమె భర్తకు చిరునవ్వుతో స్వాగతమివ్వడానికి ఆయత్తమయింది.

మరో ముప్పై సెకండ్లలో స్కూటర్ ఇంటి ముందు ఆగింది.

స్కూటర్ ఆగిన శబ్దం విని అటుతిరిగి చిరునవ్వు నవ్వింది నయన భర్తకు స్వాగతంగా. తనూ పలకరింపుగా నవ్వేడు చంద్రం. తను నవ్విన వెంటనే అతనూ నవ్వుతాడని ఆమెకు తెలుసు.

స్కూటర్ గేట్లోంచి లోపలికి తీసుకువచ్చి షెడ్లో పెట్టేడు చంద్రం. ఆప్యాయంగా భార్య భుజాలమీద చేతులు వేసి లోపలికి తీసుకువెళ్ళాడు.

"నయనా నీకో గుడ్ న్యూస్" ఆనందంగా అన్నాడు చంద్రం. ఆమెను సోఫాలో కూర్చోబెట్టి ఆమె చేతులను తన చేతుల్లోకి తీసుకుంటూ.

"ఆ న్యూసేదో కాఫీ త్రాగిన తరువాత చెప్పండి మహానుభావా" అంటూ అతని చేతుల్లోంచి విడిపించుకుని వంట గదిలోకి నడిచింది నయన.

పొగలు కక్కుతున్న కాఫీ కప్పు చంద్రం చేతికి అందించి అతని పాదాలవద్ద కూర్చుని బూట్లు విప్పసాగింది నయన.

"నయనా" ఆర్ద్రంగా పిలిచాడు చంద్రం.

అతని గొంతులోని మార్దవానికి విస్మయపడి ఒక్క క్షణం తను చేస్తున్న పని ఆపింది నయన.

"ఏమిటండీ?" అడిగింది.

"నయనా! నా ఫ్రెండ్ మాధవరావు బంధువు ఒకాయన ఫారిన్‌లో పేరుపొందిన కళ్ళ డాక్టరు. ప్రస్తుతం ఈ ఊళ్ళోనే ఉన్నాడు. నీ కళ్ళ గురించి అంతా ఆయనతో చెప్పాను. ఆపరేషన్ చేయిస్తే నీకు చూపు వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు నయనా," ఆనందంగా చెప్పుకుపోతున్నాడు చంద్రం.

చేష్టలుడిగి అతని పాదాల వద్ద కూర్చుండిపోయింది నయన.

నిజమా! తనకు చూపు వస్తుందా? అందరిలాగే తనూ ఈ ప్రకృతిలోని అందాలు చూసే అదృష్టవంతురాలవుతుందా! నమ్మలేక పోతోంది నయన.

"ఏమండీ! నిజమేనా?" చూపు లేని ఆమె విశాల నయనాలు ఆనందంతో వర్షిస్తుండగా అడిగిందామె.

"నిజం నయనా! రేపే నిన్ను ఆయన దగ్గరకు తీసుకువెళుతున్నాను." ప్రేమగా ఆమె చెంపలపై

## చైతన్యం

చైతన్యం మీద
కొరడా విసిరేవాడు
పదవి కోసం ప్రాకులాడేవాడు
చైతన్యంతో నిత్యం ఎగిరిపడేవాడు
సూర్యునిలా తేజస్సు గలవాడు చూడు!
నిత్యం కిరణాల వర్షం కురిపిస్తాడు!
స్నానం కానీయ్
రేపటి పారిజాతాల కోసం
గుండెల్లో శబ్దాల్ని సరిచేసుకో
కలత నిద్ర మానేయాలంటే
సూర్యునిలా నిస్వార్థంగా
చైతన్యాన్ని సృష్టించుకో!
జీవన స్రవంతిలో కదలిపో!!

- గుడిమెట్ల గోపాలకృష్ణ


జాలువారుతున్న కన్నీరు తుడుస్తూ అన్నాడు చంద్రం.

నయన చూపులేకుండా పుట్టడమే కాకుండా, పుట్టిన వెంటనే తల్లిని పోగొట్టుకున్న దురదృష్టవంతురాలు.

అమితంగా ప్రేమించిన భార్య మరణంతో సగం కృంగిపోయిన ఆనందరావుగారు - పుట్టిన ఒక్కగానొక్క కూతురు చూపులేనిదని తెలిసి పూర్తిగా కృంగిపోయాడు.

పెద్దల పోరుతో దూరపు బంధువుల అమ్మాయి అనసూయను రెండో పెళ్ళి చేసుకుని ఆమెకో కుమారుణ్ణి ప్రసాదించి మరో రెండేళ్ళలో తనువు చాలించాడు ఆనందరావు కూతురిమీద దిగులుతో.

కొడుకు పుట్టక ముందు అనసూయ నయనను కంటికి రెప్పలాగే పెంచింది. కొడుకు పుట్టిన తరువాత తన ప్రేమనంతా కొడుక్కి




మాత్రమే ఇవ్వగలిగిందామె.

ఆనందరావు మరణించిన తరువాత నయనను - తల్లిని, తండ్రిని పొట్టనబెట్టుకున్న రాక్షసిగా ఎంచి ఆమెమీద ద్వేషాన్ని పెంచుకుంది అనసూయ.

అయిదేళ్ళ నయనను ఏమీ చేయడానికి లేదు కాబట్టి ఆ ద్వేషంతోనే ఆమెను తన కొడుకుతో బాటు పెంచింది. ఆనందరావు మిగిల్చిపోయిన ఆస్తి ఆమెకు భుక్తికి లోటు చేయలేదు. ఇళ్ళపై, షాపులపై వచ్చే అద్దెలూ ఆమె జీవితాన్ని సుఖమయమే చేశాయి.

కానీ ఆమె నయనపై ప్రేమను మాత్రం చూపలేకపోయింది.

ఇలా చూపు లేని నయన - తల్లినీ, తండ్రినీ పోగొట్టుకుని ఎవరి ప్రేమకూ నోచుకొనక అలాగే పెరిగింది.

చూపు లేకపోవడంతో ఆమెకు చదువుకునే అదృష్టం కూడా కలగలేదు. ఇంటిలో సవతి తల్లికి చూపు అవసరం లేని అన్నిపనుల్లో సాయం మాత్రం చెయ్యగలిగింది.

అనసూయ - నయనకు ప్రేమను ఇవ్వలేకపోయినా తిండికీ, బట్టకు మాత్రం లోటు చేయలేదు.

సహజంగా అందగత్తె అయిన నయన వయసు పెరుగుతున్న కొద్దీ మరింత ఆకర్షణీయంగా కనిపించి మగపిల్లల మనసుల్లో అలజడి రేపేది.

కానీ ఇవేమీ చూపులేని నయనకు తెలిసేవి కావు. అనురాగం, ఆప్యాయతలకు నోచుకోని ఆమెకు ప్రేమ, అభిమానం అంటే ఏమిటోకూడా తెలిసే అవకాశం లేదు.

ఆమె ఆకర్షణీయమైన రూపం చూసి చుట్టుపక్కల ఇళ్ళలోని ఆడపిల్లలు ఆమెను తమతో ఆటలకు పిలిచేవారు. ఆమెను చక్కగా అలంకరించి ఆమెలో తమ రూపాన్ని ఊహించుకుని సంబరపడిపోయేవారు. వాళ్ళ మాటలనుబట్టి తను చాలా అందంగా ఉంటానని తెలుసుకుంది నయన. కానీ 'అందం' అంటే..? ఆమె 'ఊహ'కు అందేది కాదు.


"నీ బుగ్గలు గులాబీ రంగులో ఎంత ముద్దొస్తున్నాయో తెలుసా నయనా?" అనేవారు స్నేహితురాళ్ళు మాటల సందర్భంలో.

"గులాబీ రంగా? అంటే ఎలా ఉంటుంది?" అమాయకంగా అడిగేది నయన.

అసలు రంగులే తెలియని నయనకు గులాబీ రంగంటే ఏమిటో ఎలా చెప్పాలో అర్థమయ్యేది కాదు ఆ అమ్మాయిలకు.

ప్రకృతినీ, అందులోని అందాలను, రంగులను, అందమైన పక్షులను, జంతువులను చూడలేని తన దురదృష్టానికి అప్పుడప్పుడూ కుమిలి కుమిలి ఏడ్చేది నయన.

ఏడ్చి ఏడ్చి మనసులోని భారం దింపుకున్న తరువాత తన ఊహల్లోనే - పక్షులను,



## షారూక్ ఆనందం

**పు**ట్టిన రోజునాడు బాలీవుడ్‌బాద్‌కి ఆనందానికి హద్దే లేకుండాపోయింది. తన భార్య గౌరీఖాన్, మిత్రుడు కరణ్‌జోహార్‌లు ఖాన్ ఆనందానికి కారకులు. నవంబర్ రెండు షారూక్ బర్త్‌డే. ఒకటో తేదీ రాత్రి పుల్లుగా నిద్రపోతున్నాడట షారూక్. అర్ధరాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చేసరికి ఎదురుగా భార్య, మిత్రుడు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్నారు. తీరా లేచి చూస్తే ఇల్లంతా లైట్లతో దేదీప్యమానంగా వెలిగిపోతూ 38వ జన్మదినానికి స్వాగతం చెప్పిందట. అంత కష్టపడి తనకు ఆనందం పంచిన భార్య, మిత్రులకు ఎంతో రుణపడి ఉన్నానంటూ చెప్పాడు షారూక్.

జంతువులను, పువ్వులను, రంగులను చూసి ఆనందపడిపోయేదామె.

నయనకు పద్దెనిమిదో . ఏడు రాగానే అనసూయమ్మ ఆమెకు పెళ్ళి చేసి పంపే ఏర్పాట్లు మొదలుపెట్టింది.

బ్యాంక్‌లో గుమాస్తాగా పనిచేస్తున్న చంద్రం పెళ్ళి చూపుల్లో నయనను చూడగానే చూపు లేకపోయినా అమాయకంగా, అందంగా, విరిసిన మల్లెలా ఉన్న ఆమెను పెళ్ళిచేసుకోడానికి నిశ్చయించుకున్నాడు.

చూపులేని తనను కానీ కట్నం కోరకుండా పెళ్ళిచేసుకోడానికి ముందుకు వచ్చిన చంద్రానికి మనసులోనే చేతులు జోడించి నమస్కరించింది నయన.

ఈ గుడ్డిపిల్లకు అసలు పెళ్ళే కాదేమోనని భయపడిన అనసూయమ్మ ఆ కట్నం కోరని పెళ్ళికొడుకుతో నయన పెళ్ళి ఘనంగానే జరిపించి తన బరువు దింపుకుంది.

పెళ్ళిలో - తన భర్త చంద్రం అందగాడు కాదన్న మాటలు నయన చెవిన పడుతూనే ఉన్నాయి. అందం అంటే ఏమిటో తెలియని నయనకు 'అందంగా లేకపోవడం' అంటే ఏమిటో ఆలోచించడానికే వీలుకాలేదు. దాంతో ఆమె అందంగా లేకపోవడం అన్న విషయాన్నే పట్టించుకోలేదు.

భర్తతో మొదటిరాత్రి గడిపిన తరువాత ఆమెకు జీవితంలో ప్రేమ, అనురాగం, అభిమానం అంటే ఏమిటో తెలిసివచ్చాయి.

ఇంతకాలం తను ఏం పొందలేకపోయిందో తలుచుకుంటే ఆమె గుండెలు పొగిలి పొగిలి పడ్డాయి.

చూపులేని భార్యను చంద్రం తన కనుపాపకంటే జాగ్రత్తగా చూసుకుంటున్నాడు. ఇంటి పనులకు, వంట పనులకు పనిమనుషులను పెట్టాడు.

ఆమె చేసుకోలేని ప్రతి చిన్నపనికీ భర్తమీద ఆధారపడేది నయన. చిరునవ్వుతో ఆమెకు ఆ పనుల్లో సాయపడేవాడు చంద్రం.

తన భార్య అయిన తరువాత - ఆమెను కనిపించిన కంటి డాక్టర్ దగ్గరకల్లా తీసుకువెళ్ళి చూపించాడు చంద్రం.

ఆమెను పరీక్షించిన ప్రతి డాక్టరూ పెదవి విరిచాడు.

ఇన్నాళ్ళకు ఆమెకు చూపు రావచ్చునన్న డాక్టరు 'కనిపించే' సరికి చంద్రం ఆనందానికి అంతులేదు.

ఆమెకు చూపు తెప్పించి - ప్రకృతిలో గల అందాలన్నీ ఆమెకు తను దగ్గరుండి చూపించాలని ఉవ్విళ్ళూరుతున్నాడతను.

ఆ మరునాడు ఆ ఫారిన్ డాక్టర్ ఆమెను పరీక్షించి రకరకాల టెస్టులు చేసి ఆపరేషన్ చేస్తే ఆమెకు తప్పకుండా చూపు వస్తుందని చెప్పాడు.

ఈ సంగతి విని నయన ఆనందంతో పులకించిపోయింది.

తనకు చూపు వస్తే తననింత ఆదరంతో, ప్రేమగా చూసుకుంటున్న భర్తను తనివితీరా చూడాలని ఉంది ఆమెకు.

అందమైన తన రూపాన్ని 'అద్దం'లో చూసుకుని మురిసిపోవాలని ఉంది.

తమ ఇంటిలోని ప్రతి వస్తువునూ తనివితీరా చూడాలని తహతహలాడుతోందామె మనసు.

**నయన**

నాకు చూపు వస్తుందంటే ఎంతో ఆనందపడిపోయాను. ప్రకృతిలోగల అందాలన్నీ అందరిలా చూసి ఆనందించాలని తహతహలాడిపోయాను.

చూపు వస్తే ఆయనకు చాలా శ్రమ తగ్గించిన దానినవుతాననుకున్నాను.

ఇప్పుడు అన్ని పనులకూ ఆయనమీద ఆధారపడి, ఆయన లేకపోతే నా బ్రతుకే లేనట్లుగా ఉన్నాను. నాకు చూపు వస్తే ఆయన మీద ఆధారపడవవసరం లేదు. అలా ఆయన నాకు దూరమైపోతారేమో? నా పనులు నేనే చేసుకుని దేవుడులాంటి ఆయనను అలక్ష్యం చేస్తానేమోనని భయంగా ఉంది.

భగవాన్! అటువంటి పరిస్థితిని నేను ఊహల్లోనైనా భరించలేకపోతున్నాను. ఆయన మీద ఆధారపడి బ్రతికే బ్రతుకే నాకు కావాలి. అన్నీ బాగా ఆలోచించి నాకు చూపు వద్దనే నిర్ణయానికి వచ్చాను. రేపే ఆయనతో చెప్పేస్తాను నాకు చూపు వద్దు మీరే కావాలని.

**చంద్రం**

తనకు అపరేషన్ వద్దని, చూపు అవసరం లేదని నయన ఏడుస్తూ చెప్పగానే ఒక్క క్షణం నిర్ఘాంతపోయాను. చూపురాగానే ఆమెకు అన్నీ దగ్గరుండి చూపించాలని ఎంత సరదాపడ్డానో మరి ఇప్పుడిదేమిటి?

తనకు చూపువద్దనీ నేనే కావాలనీ ఆమె బేలగా అనగానే ఆమె మనసులోని భయం నాకు అర్థమైపోయింది. తనకు నేను దూరమైపోతానేమో నని భయపడుతోంది పిచ్చిపిల్ల.

ఒకవిధంగా ఆలోచిస్తే ఆమెకు చూపులేకపోవడమే మంచిదనిపిస్తోంది. ఆమెకు చూపు వస్తే తానెంత అందమైనదో గ్రహించడమే గాక నేనెంత కురూపినో ఆమెకు తెలిసిపోతుంది. అప్పుడామె నన్ను అసహ్యించుకుని నా మీది ప్రేమను తుంచేసుకుంటే? భగవాన్! నేనది భరించగలనా? అందుకే ఆమె ఆపరేషన్ వద్దని చెప్పిన తరువాత అన్నీ ఆలోచించి 'సరే' నన్నాను.

ఆమె దేవత! నాకోసం తన చూపునే త్యాగం చేసింది. ఆమె పట్ల నా ఆరాధన రెట్టింపయింది ఈ సంఘటనతో.

ఆమెది మహోన్నతమైన త్యాగం - నాది కేవలం స్వార్థం అంటారా? మీ ఇష్టం!